
సాక్షి
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



మెట్టినింటికి వీరమ్మ తల్లి

ఉయ్యూరు(పెనమలూరు): వీరమ్మతల్లి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. మెట్టినింటి సారె అందుకున్న అమ్మవారు పల్లకీలో ఊరేగింపుగా బయలుదేరారు.




పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0610 టీఎంసీలు. ఎగువ నుంచి 2.200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 2000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

నేడు దుర్గమ్మకు స్వర్ణ పుష్పార్చన

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు గురువారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించనున్నారు. రూ. 2500 టికెటు కొనుగోలు చేసిన భక్తులు ఈ సేవలో పాల్గొనవచ్చు.



న్యూస్‌రీల్

నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం



గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారి దేవస్థాన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఉత్తర్వుల మేరకు కొత్త కార్యవర్గం ఎంపిక చేసినట్లు ఆలయ ఈఓ కానూరి సురేష్‌బాబు తెలిపారు. తొలుత ఆలయ పాలకవర్గ సభ్యుల సమావేశం అనంతరం కమిటీ అధ్యక్ష ఎంపిక జరిగిందన్నారు. శేషం వీరవెంకట కృష్ణమూర్తి అధ్యక్షుడిగా, పాలక వర్గ సభ్యులుగా పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకట్రావు, బాడిగ లీలా సౌజన్య, నారేపాలెం వెంకట నిర్మల, డోకాల భాగ్యలక్ష్మి, యార్లగడ్డ పావని, రుద్రపాక శరత్‌చంద్ర, సంతోష్ ప్రమాణ స్వీకారం చేశారు.

స్కూల్లో ట్యాబ్‌ల వినియోగం పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు తప్పనిసరిగా వినియోగించుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి సూచించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని జిల్లా, మండల పరిషత్ పాఠశాలలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాల టాయిలెట్స్ దుర్వాసన రావడాన్ని గమనించి ప్రధానోపాధ్యాయురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్క్ బుక్, నోట్ బుక్‌లను సరిగ్గా రాయించని ఉపాధ్యాయులను మందలించారు. ఇలాంటివి మరోమారు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కువ మంది పిల్లలు ఇంటి వద్ద నుంచే భోజనం తెచ్చుకోవడాన్ని గుర్తించి అందరూ స్కూల్లోనే మధ్యాహ్న భోజనం తినేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థుల వద్ద ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ఎంఈవో ఆదూరి వెంకటరత్నం, సీఆర్‌పీ గోపి తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి పటిష్ట బందోబస్తు



విజయవాడ స్పోర్ట్స్: మహా శివరాత్రి మహోత్సవాలకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని కృష్ణానది పరివాహక ప్రాంతాల స్నానపు ఘాట్లు, దేవాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా, కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. కృష్ణా జిల్లా పరిధిలోని యనమలకుదురు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని దుర్గాఘాట్, పున్నమిఘాట్, భవాని ఘాట్ పరిసర ప్రాంతాలను ఇద్దరు అధికారులు బుధవారం పరిశీలించారు. భక్తులు స్నానం ఆచరించే ఘాట్లు, పరిసరాల్లోని శివాలయాలను సందర్శించారు. మహా శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనం చేసుకుంటారని చెప్పారు. అదేవిధంగా ప్రభల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రెండు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేక నిఘా, బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రభల ఊరేగింపు సమయంలో ఎదురయ్యే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను ప్రభల తయారీదార్లకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

యార్డులో 1,38,237 బస్తాల మిర్చి విక్రయం

గుంటూరు:మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,195 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,38,237 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.21,500 వరకు ఉంది.

బాడీ బిల్డింగ్ @ బెజవాడ



వాణిజ్య రాజధానిగా పేరొందిన బెజవాడ లారీల బాడీ బిల్డింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. లారీలకు బాడీలు తయారు చేసే నిపుణులు ఇక్కడే ఉన్నారు. కొత్తగా లారీ కొనుగోలు చేస్తే దానికి బాడీ కట్టివ్వాలంటే విజయవాడ రావాల్సిందే. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో లారీలను ఆటోనగర్ తీసుకొస్తారు. ఒకప్పుడు యజమానులు ఆరు టైర్ల లారీలకే పరిమితమయ్యేవారు. కానీ నేడు మారిన పరిస్థితుల నేపథ్యంలో 16 టైర్ల లారీలపై మక్కువ కనబరుస్తున్నారు. వాటిని ఎక్కడ కొనుగోలు చేసినా బాడీలు కట్టించడానికి మాత్రం విజయవాడ తేవాల్సిందే.



సాక్షి, కృష్ణాడెస్క్: కరోనా విలయతాండవం తర్వాత కొన్ని రంగాల్లో పరిస్థితులు చక్కదిద్దుకున్నాయి. విజయవాడలోని జవహర్ ఆటోనగర్ కార్మికులు చేతి నిండా పనులతో ఉపాధి పొందుతున్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ఆటోనగర్‌లో ప్రస్తుతం లారీల బాడీ బిల్డింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకప్పుడు ఆరుటైర్లు ఉంటే ఎంతో గొప్పగా భావించే లారీల యజమానులు ఇప్పుడు 16 టైర్ల లారీలను కొనుగోలు చేసి వాటికి బాడీలు కట్టిస్తున్నారు. వీటికి మెయింటెనెన్స్ తక్కువగా ఉంటుందని అంటున్నారు. అంతే కాకుండా 35 టన్నుల వరకు లోడు వేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఆరు టైర్ల వాహనాలకు ప్రతి 18 వేల కిలోమీటర్లకు ఇంజిన్ ఆయిల్ మార్చాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. 16 టైర్ల వాహనాలకు (లారీ) ఇంజిన్ ఆయిల్ 80 వేల కిలోమీటర్లకు మారిస్తే సరిపోతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. దీంతో ఈ లారీలనే ఎక్కువ కొనుగోలు చేస్తున్నామని యజమానులు స్పష్టం చేస్తున్నారు. ఈ రకం లారీలన్నీ కర్నూలు జిల్లా బేతంచర్ల, నెల్లూరు, వైజాగ్, గుంటూరు, పొన్నూరు, తదితర ప్రాంతాల నుంచి ఆటోనగర్‌కు వస్తున్నాయి. 10 నుంచి 15 రోజుల్లో లారీ బాడీ బిల్డింగ్ పనులు పూర్తి చేస్తున్నారు. కార్మికులు ఎంతో నైపుణ్యంతో బాడీలు కడుతున్నారు.

- 16 టైర్ల లారీల బాడీ నిర్మాణంలో ప్రత్యేకం
- ఆటోనగర్‌లో నైపుణ్యమైన కార్మికులు
- అనేక రాష్ట్రాల నుంచి వస్తున్న యజమానులు
- ఉపాధి బాగా ఉందంటున్న షెడ్ యజమానులు

ఎంతో మంది వృత్తి నిపుణులు...

ఒక్కో లారీ బాడీ బిల్డింగ్ చేయడానికి 11 రకాల వృత్తి నైపుణ్యాలు కలిగిన కార్మికులు అవసరం. కార్పెంటరీ, టింకరింగ్, కమ్మరం, పొండ్రి, పెయింటర్, ఎలక్ట్రీషియన్, అద్దాలు, సట్లు, స్టిక్కరింగ్, టైర్లు తదితర పనుల్లో స్కిల్ వర్కర్లు అందుబాటులో ఉంటారు. సుమారు రెండు వారాల పాటు వీరంతా శ్రమిస్తే గానీ 16 టైర్ల లారీలకు బాడీ బిల్డింగ్ పూర్తి కాదు. ఆటోనగర్‌లో సుమారు వెయ్యి మంది కిపైగానే కార్మికులు ఉన్నారు. వీరంతా లారీల బాడీల తయారీ పనుల్లో పాలుపంచుకుంటారు.

బాడీ నిర్మాణం పూర్తయిన తర్వాత లారీ



ఆటోనగర్‌లో లారీ బాడీ బిల్డింగ్ యూనిట్లు

- కరోనాకి ముందు: 200
- కరోనా తర్వాత : 100
- ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నవి : 50
- 16 టైర్ల లారీకి బాడీ బిల్డింగ్ పూర్తి చేయడానికి పట్టే సమయం: 10 నుంచి 15 రోజులు
- ఒక్క లారీ బాడీ బిల్డింగ్‌కి అయ్యే ఖర్చు రూ.4.80 లక్షలు
- ఒక్కో కార్మికుడికి రోజు కూలీ: రూ.1,000 నుంచి రూ.1,200
- ఆటోనగర్ నుంచి పని పూర్తి చేసి బయటకు పంపే లారీల సంఖ్య రోజుకు: 50
- వర్క్ బిజీగా ఉండే మాసాలు (సీజన్) : జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్
- (సీజన్‌లో ఈ ప్రాంతంలో లాడ్జిలు, హోటళ్లు బిజీ బిజీగా ఉంటాయి).

ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాం



16 టైర్ల బాడీ బిల్డింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాం. ఎక్కడా లోటు లేకుండా పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేసి యజమానులకు అప్పగిస్తాం. గత మూడు నెలల నుంచి ఆటోనగర్‌కు 16 టైర్ల లారీలు వస్తున్నాయి. ఈ లారీలో 35 టన్నుల లోడింగ్ చేసుకునే అవకాశం ఉంది. బాడుగ కూడా ఎక్కువ వస్తుంది. ఆయా కంపెనీలకు చెందిన వారు 16 టైర్ల లారీలకు భారీగా డిస్కౌంట్లు ఇస్తున్నారు. దీంతో ఎంతో మంది వీటిని కొనుగోలు చేసి బాడీ బిల్డింగ్ కోసం బెజవాడ వస్తున్నారు. కరోనా తర్వాత కార్మికులకు చేతి నిండా పని దొరుకుతుంది.

–సంపర మల్లేశ్వరరావు, షెడ్ యజమాని

లారీ బాడీ నిర్మాణంలో నిమగ్నమైన కార్మికులు









నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం రూ. లక్ష విరాళం అందచేశారు. విజయవాడ గుప్తా సెంటర్‌కు చెందిన ఎ. శ్రీనివాసరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకొని ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబును కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళం అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం తర్వాత దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ జట్లు ఎంపిక

పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ జట్టు సెలక్షన్స్ ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల మనోహర్ తెలిపారు. కానూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్చి 4, 5 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో 13వ జూనియర్ మిస్టర్ ఇండియా –23 జాతీయ బాడీ బిల్డింగ్ పోటీలు ఉన్నాయన్నారు. ఇందు కోసం ఆంధ్ర టీం ఎంపిక ఈ నెల 19వ తేదీన భీమవరంలో జరుగుతుందన్నారు. జిల్లా జట్టు ఎంపిక 17వ తేదీన కానూరు అశోక్ జిమ్‌లో ఉదయం 10 గంటలకు ఉంటాయని పేర్కొన్నారు. సెలక్షన్స్‌కు వచ్చే క్రీడాకారులు ఫొటో, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం 8686771358, 8555047808 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్, సభ్యులు అల్లూరి రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

వాహనాల విడుదలకు హెల్ప్‌డెస్క్

విజయవాడ స్పోర్ట్స్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు త్వరితగతిన విడుదల చేసుకునేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హెల్ప్‌డెస్క్‌లో ఎస్‌ఐలు కె.సతీష్‌కుమార్ (9133599 975), ఎస్.నాగేశ్వరరావు (7702676 456) వాహనదారులకు అందుబాటులో ఉంటారన్నారు. వాహనాలను విడిపించుకునేందుకు అవసరమైన సమాచారాన్ని ఇద్దరు అధికారులు అందిస్తారని తెలిపారు.

ప్రతి పరిణామం ప్రపంచంపై ప్రభావం



సమకాలీన అంతర్జాతీయం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు తదితరులు



డిసెంబ్రిస్టు ఖైదీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్.వేణుగోపాల్ తదితరులు

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- సాహితీవేదికపై రెండు పుస్తకాలు ఆవిష్కరణ

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయంగా ఏ దేశంలో ఎటువంటి ఘటన చోటు చేసుకున్నా అవి ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ముద్రించిన బుడ్డిగ జమిందార్ రచన 'సమకాలీన అంతర్జాతీయం' పుస్తకావిష్కరణ విజయవాడ పుస్తక మహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై బుధవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. వివిధ దేశాల్లో జరిగే ప్రతి పరిణామం అనేక దేశాలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. కరోనా నేపథ్యంలో అమెరికాలో చోటు చేసుకున్న ఆర్థిక మాంద్యం ప్రపంచ వ్యాప్తంగా జాబ్‌మార్కెట్‌ను తీవ్రంగా కుదిపిందని తెలిపారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరిగిన యుద్ధంతో ఆయిల్, ఇతర ఆహార దినుసుల ధరలపై ప్రభావం చూపిందన్నారు. కొన్ని రోజులుగా చోటు చేసుకున్న అంశాలపై రాసిన వ్యాసాల సంపుటిని 'సమకాలీన అంతర్జాతీయం' పేరుతో పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమని చెప్పారు. పుస్తక సమీక్ష చేసిన వీక్షణం సంపాదకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న చాలా విషయాలను రచయిత ఈ పుస్తకంలో వివరించే ప్రయత్నం చేశారన్నారు. సాధారణంగా సరిహద్దు ప్రాంతాల్లో ఏమి జరుగుతుందో ఎవరికీ స్పష్టత ఉండదన్నారు. అక్కడి ప్రభుత్వాలు ఇచ్చే ప్రకటనలతోనే సమాచారం అందుతుందన్నారు. కానీ రచయిత తన సత్యాన్వేషణ సాగించి చాలా అంశాలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారన్నారు. రచయిత జమీందర్ మాట్లాడుతూ వివిధ దేశాల్లో నివసించిన తాను కొద్ది సంవత్సరాలుగా పరిశోధనాత్మకంగా ముందుకు సాగుతూ పలు అంతర్జాతీయ అంశాలపై పత్రికలకు వ్యాసాలను రాశానని పేర్కొన్నారు. వాటికి సంబంధించి 2020 వరకూ వచ్చిన వ్యాసాలను పుస్తక రూపంలో తీసుకొచ్చానని వెల్లడించారు. విశాలాంధ్ర పబ్లిషర్స్ డీజీఎం మనోహరనాయుడు నిర్వహించారు.

'డిసెంబ్రిస్టు ఖైదీ' నవల ఆవిష్కరణ

రష్యాలో గడిచిన రెండు శతాబ్దాల్లో జరిగిన అనేక పోరాటాలకు డిసెంబ్రిస్టు ఉద్యమం ప్రేరణగా నిలిచిందని వీక్షణం సంపాదకులు ఎస్.వేణుగోపాల్ తెలిపారు. సాహితీవేత్త ఎస్‌పీఎస్ నాగభూషణ్ రచించిన 'డిసెంబ్రిస్టు ఖైదీ' (రష్యా చారిత్రక తెలుగు నవల) పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రష్యా జీవితాన్ని ఆధారంగా చేసుకొని ఇప్పటి వరకూ ఏ సాహిత్య గ్రంథం తెలుగులో నేరుగా రాలేదన్నారు. అది కేవలం 'డిసెంబ్రిస్టు ఖైదీ' మొట్టమొదటి గ్రంథమని పేర్కొన్నారు. 1825లో రష్యాలో జార్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి సంబంధించిన విషయాలను తీసుకొని రచయిత అద్భుతంగా ఈ గ్రంథాన్ని తీసుకొచ్చారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర నేత అక్కినేని వనజ మాట్లాడుతూ రష్యాలో రెండు వందల సంవత్సరాల క్రితం చోటు చేసుకున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన అక్షర రూపం ఈ నవల అన్నారు. రచయిత నాగభూషణ్ గొప్ప ప్రయోగాన్ని చేసి గ్రంథాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమానికి డి.రమేష్‌పట్నాయక్ అధ్యక్షత వహించారు. కె.కృష్ణయ్య పర్యవేక్షించారు. రచయిత నాగభూషణ్ స్పందించి రచన సాగిన తీరును వివరించారు.



దేశ భక్తుల చిత్ర పటాలు చూస్తున్న విద్యార్థులు

జోషి సేవలు అపూర్వం

విశాలాంధ్ర బుక్ హౌస్ పూర్వ జనరల్ మేనేజర్ ప్రేరేపి పూర్ణచంద్ర జోషి సాహితీ వికాసానికి అందించిన సేవలు అపూర్వమని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ కొనియాడారు. విశాలాంధ్ర బుక్ హౌస్ జనరల్ మేనేజర్ పూర్ణచంద్ర జోషి, ఎస్‌బీటీ ఉద్యోగి లలితాజోషి సంస్మరణ కార్యక్రమం విజయవాడ పుస్తక మహోత్సవంలో బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ విశాలాంధ్ర బుక్‌హౌస్ బాధ్యుడిగా జోషి అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో పబ్లిషర్ జయంతి సుబ్బరామయ్య, పాత్రికేయురాలు మంజరి, ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌ల మేనేజర్లు లక్ష్మయ్య, మనోహరనాయుడు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సాహితీవేత్త సత్రీ అధ్యక్షత వహించారు.

కృష్ణవేణి విగ్రహానికి కొత్త శోభ

- అందంగా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశం
- విగ్రహాన్ని పరిశీలించిన కలెక్టర్
- ఇంద్రకీలాద్రిపై నిర్మించిన చైనా వాల్ నిర్మాణ పటిష్టతపై ఆరా
- విగ్రహ మరమ్మతులకు రూ.5 లక్షలు మంజూరు



ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉన్న కృష్ణవేణి విగ్రహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

సాక్షి, ప్రతినిధి, విజయవాడ: ప్రకాశం బ్యారేజి వద్ద గల కృష్ణవేణి విగ్రహానికి కొత్త సొబగులతో పూర్వ వైభవం తెచ్చే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కృష్ణవేణి విగ్రహానికి మహానాశికం, పట్టీలు, కలశం మరమ్మతులు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కనకదుర్గ అమ్మవారి దేవస్థానం అధికారులతో కలిసి కృష్ణవేణి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి గొల్లపూడి పర్యటనకు వచ్చి వెళ్లిన సమయంలో ప్రకాశం బ్యారేజీ, ఇంద్రకీలాద్రి పై నిర్మించిన చైనా వాల్‌ను పరిశీలించారు. కృష్ణవేణి విగ్రహం, మహానాశకం కలశం కళా విహీనంగా ఉండటాన్ని గమనించారు. వాటికి వెంటనే మరమ్మతులు చేసి, పూర్వవైభవం తేవాలని ఆదేశించారు.

30 సంవత్సరాల క్రితం ఏర్పాటు....

1992 పుష్కరాల సందర్భంగా 30 సంవత్సరాల క్రితం ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి విగ్రహ పరిసర ప్రాంతాల కట్టడాలు , ఇప్పటి వరకు ఎటువంటి రిపేర్లకు నోచుకోలేదు. దీంతో విగ్రహం రంగులు వెలిసి కళా విహీనంగా మారింది. ముఖ్యమంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు శిల్ప కళలో ప్రావీణ్యత కలిగిన శిల్పుల పర్యవేక్షణలో బాగు చేస్తున్నారు. కనక దుర్గమ్మ దేవస్థానానికి సంబంధించిన రూ.5 లక్షల నిధులతో విగ్రహానికి మహానాశకం, కలశం పట్టీలు, హంసలకు మరమ్మతులు చేసి రంగులతో తీర్చి దిద్దుతున్నారు. తద్వారా సందర్శకులు, భక్తులను ఆకర్షించే విధంగా చేస్తున్నారు. ఈ పనులు వీలైనంత త్వరిత గతిన పూర్తి చేయాలని ఆలయ ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు.

చైనా వాల్ పటిష్టతపై...

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఇంద్రకీలాద్రిపై నిర్మించిన చైనా వాల్ పటిష్టతపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో చైనా వాల్ నిర్మాణం జరిగినట్లు అధికారులు వివరించారు. అయినప్పటికీ మరోసారి నిపుణులతో పరిశీలించి ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నట్లు వివరించారు. కనకదుర్గా దేవస్థానం ఈవో డి.భ్రమరాంబ, ఈఈ ఎల్.రమ, ప్రకాశం బారేజీ ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మంత్రి కారుమూరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలుదీరిన దుర్గమ్మను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. మంత్రి నాగేశ్వరరావు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు మంత్రికి అందజేశారు.

క్లుప్తంగా

బ్రాహ్మణ మహిళా సదస్సు పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న దుర్గగుడి ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం మార్చి 5న రాజమండ్రిలో నిర్వహిస్తున్న మహిళా సదస్సుపై రూపొందించిన పాటను దుర్గగుడి ఈవో భ్రమరాంబ బుధవారం విడుదల చేశారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సమాఖ్యకు చెందిన పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. మహిళలను చైతన్య పరుస్తూ రూపొందించిన పాట ఉన్న ల్యాప్‌టాప్‌లో బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష్, రాష్ట్ర కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నదిలో దూకిన వ్యక్తిని కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్



నదిలో దూకిన వ్యక్తిని కాపాడి, ప్రథమ చికిత్స అందిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడి ఆస్పత్రికి తరలించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మంగళగిరికి చెందిన ఆకుమూరి కృష్ణ (32) ఆటోడ్రైవర్‌గా జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితాన్ని చాలించాలని నిర్ణయించుకున్నాడు. ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుకుని కృష్ణానదిలోకి దూకాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న పాదచారులు కొంతమంది ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆరో బెటాలియన్‌కి చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం హుటాహుటిన అక్కడికి చేరుకుంది. కృష్ణను బయటకు తీసుకొచ్చి ప్రథమచికిత్సను అందించింది. అనంతరం ఆసుపత్రికి తరలించింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందించింది. వన్‌టౌన్ పోలీసులు కృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. చికిత్స అనంతరం కృష్ణను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మెట్టినింటికి వీరమ్మ తల్లి

దారిపొడవునా పూలవర్షంతో ఘనస్వాగతం



మెట్టినింటిలోకి ప్రవేశిస్తున్న అమ్మవారు

ఉయ్యూరు(పెనమలూరు): భక్తుల కల్పవల్లి శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లికి భక్తజనం నీరాజనం పలికారు. 15 రోజులు పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలను పూర్తి చేసుకున్న అమ్మవారు.. ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి బుధవారం మెట్టినింట ప్రవేశం చేసి, పూజలందుకున్నారు. ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం ముగియటంతో బుధవారం ఉదయం మెట్టినింటి సారె అందుకున్న అమ్మవారు.. కనక చింతయ్య సమేతంగా పల్లకీలో ఊరేగింపుగా బయలుదేరారు. ప్రధాన సెంటర్ గుండా ఊయల స్తంభాల వద్దకు చేరుకుని ఊయల ఉత్సవం జరుపుకొన్నారు. దారిపొడవునా భక్తులు పసుపునీరు ఓరబోసి హారతులతో అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాల జోరు, మేళతాళాల హోరుతో గౌడ రామాలయం, పోస్టాఫీసు రోడ్డు, కాపు రామాలయం సెంటర్, రావిచెట్టు సెంటర్ గుండా గ్రామోత్సవం జరుపుకుంటూ మెట్టినింటి వద్దకు చేరుకున్నారు. అక్కడ అశేష భక్తజనం చల్లని తల్లి పల్లకీపై పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. పారుపూడి, నెరుసు వంశస్తులు కనక చింతయ్య సమేత వీరమ్మ తల్లి విగ్రహాలను మెట్టినింట ఉంచి పూజా కార్యక్రమాలు పూర్తి చేయటంతో భక్తులు దర్శించుకుని తరించారు. మళ్లీ తిరునాళ్ల మహోత్సవం వరకూ మెట్టినింటే అమ్మవారు భక్తుల పూజలందుకుంటారు. శివరాత్రి పర్వదినాన అమ్మవారిని దక్షిణ కాశీగా పేరొందిన ఐలూరు తీసుకెళ్లి కృష్ణానదిలో పుణ్యస్నానమాచరింపజేసి తిరిగి మెట్టినింటికి చేరుస్తారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



ఏలూరు కాలువలో నుంచి మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురం వద్ద కృష్ణా-ఏలూరు కాలువ రేవులోకి స్నానం చేసేందుకు దిగి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు బుధవారం గుర్తించారు. ఉపాధి నిమిత్తం గ్రామానికి వచ్చిన ఏలూరు జిల్లా లక్కవరం మండలం దేవులపల్లికి చెందిన తూరపాటి నాగరాజు (18) మంగళవారం ఏలూరు కాలువలో స్నానం చేసేందుకు రేవు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలోకి పడిపోయాడు. దీన్ని గుర్తించిన అక్కడే దుస్తులు ఉతుకుతున్న మహిళలు నాగరాజును కాపాడేందుకు ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వీరవల్లి పోలీసులు కాలువలో నాగరాజును గుర్తించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలను రప్పించారు. వీరవల్లి ఎస్‌ఐ యు.ఎల్.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు గల్లంతైన నాగరాజు కోసం చేపట్టిన గాలింపు చర్యలతో 24 గంటల తర్వాత మృతదేహం లభ్యమైంది. కాలువలో గుర్రపు డెక్క అధికంగా ఉండటంతో దాని మధ్య చిక్కుకున్న నాగరాజు మృతదేహాన్ని గుర్తించి ఎట్టకేలకు ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వీరవల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతర యూనివర్సిటీ పోటీలకు జట్ల ఎంపిక



రోల్ స్కేటింగ్ కృష్ణాయూనివర్సిటీ జట్టు

విజయవాడ స్పోర్ట్స్: అఖిల భారత అంతర యూనివర్సిటీ రోల్ స్కేటింగ్, రోలర్‌హాకీ, ఇన్‌లైన్ హాకీ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్లను ఎంపిక చేసినట్లు వర్సిటీ క్రీడా విభాగం కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తులు తెలిపారు. ఈ జట్టుకు విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థులు విశాల్‌ఆనంద్, భరత్‌కుమార్, వంశీకృష్ణ, శ్రీకర్, చంద్రవంశీ, అజయ్‌కుమార్, ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు సాయిదత్త, ఆదిత్య, అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు సాయిగణేష్‌నాయక్, రోహిత్, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ విద్యార్థి వినయ్‌కుమార్, గుంటూరు మెడికల్ కాలేజీ విద్యార్థి జ్ఞానేశ్వర్, విజయనగరంలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థి ఉదయ్‌చైతన్య ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు.

కృష్ణావర్సిటీ జట్టు..

అఖిల భారత అంతర యూనివర్సిటీ రోల్ స్కేటింగ్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టుకు బి.వరుణ్‌కృష్ణ(పీబీ సిద్ధార్థ కాలేజీ), ఎస్.వాసుదేవరావు(నలంద డిగ్రీ కాలేజీ), మహ్మద్ ఇస్మాయిల్(వికాస్‌కాలేజీ), ఎం.హేమంత్ సూర్య(కేబీఎన్ కాలేజీ) ఎంపికయినట్లు పీబీ సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ జట్ల ఎంపిక తమ కాలేజీలో బుధవారం నిర్వహించామన్నారు.

భళా.. శ్రీశ్రీ సాహిత్య నిధి

- శ్రీశ్రీ సాహిత్య వ్యాప్తికి పాటుపడుతున్న సంస్థ
- విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రత్యేక స్టాల్



పుస్తక మహోత్సవంలో శ్రీశ్రీ సాహిత్య నిధి స్టాల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆధునిక తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన సుప్రసిద్ధ కవుల్లో మహాకవి శ్రీశ్రీ అగ్రగణ్యుడు. తన సాహిత్యంతో సామాజిక చైతన్యానికి బాటలు వేసిన మహోన్నత సాహితీ దీప్తి శ్రీశ్రీ. తెలుగు సాహిత్యంలో చెదరని ముద్ర వేసిన శ్రీశ్రీ దశాబ్దాలు గడిచినా ఆయన సాహిత్యంతో ఇంకా ప్రజలను అబ్బురపరుస్తూనే ఉన్నారు. తెలుగు అభ్యుదయ సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్న శ్రీశ్రీ ఎంతో మందికి స్ఫూర్తినిస్తూ అనేక సాహితీ సృజనలకు అండగా నిలుస్తున్నారు. ప్రధానంగా నేటి సమకాలీన సమాజంలో పాతుకుపోయిన అనేక రుగ్మతలను తన కలంతో ఎత్తి చూపి వ్యవస్థలో మార్పు కోసం పాటు పడిన సంఘసంస్కర్త మహాకవి శ్రీశ్రీ. అటువంటి మహాకవి శ్రీశ్రీ సాహిత్యాన్ని ఇంకా విస్తృతం చేయాలని.. తద్వారా సమాజాన్ని మరింత జాగృతం చేయాలని 'శ్రీశ్రీ సాహిత్యనిధి' పాటుపడుతోంది. నగరానికి చెందిన సాహితీవేత్త సింగంపల్లి అశోక్ కుమార్ ఈ సంస్థను స్థాపించి సాహితీ వికాసానికి ముఖ్యంగా శ్రీశ్రీ సాహితీ వ్యాప్తికి కృషి చేస్తున్నారు. ఆ క్రమంలోనే 33వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో స్టాల్‌ను ఏర్పాటు చేసి శ్రీశ్రీ సాహితీ గ్రంథాలను సాహితీప్రియులకు అందుబాటులో ఉంచారు.

వంద పుస్తకాలు.. రెండు వేలు

శ్రీశ్రీ సాహిత్యానికి సంబంధించి ఏడు వేలు విలువ చేసే వంద పుస్తకాలను అశోక్‌కుమార్ రెండువేలకే అందిస్తున్నారు. శ్రీశ్రీ ఉద్యమ సాహిత్య ప్రచారం కోసం సాగే ఈ సాహిత్య ఉద్యమంలో అందరూ పాల్గొనేలా చేయటానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానంగా శ్రీశ్రీకి సంబంధించిన వంద పుస్తకాలను కేవలం రెండు వేలకే అందించటానికి చాలా వ్యయప్రయాసలకు ఓర్చి అందిస్తున్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 87లో కొలువుదీరిన శ్రీశ్రీ సాహిత్య నిధి కొలువులో పలు శ్రీశ్రీ సాహితీగ్రంథాలు లభిస్తున్నాయి. అంతే కాకుండా అభ్యుదయ సాహిత్యంలో అద్భుతమైన ప్రశంసలు పొందిన శ్రీశ్రీ మహాప్రస్థానంకు అపూర్వమైన ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు.

140 పుస్తకాలను తీసుకొచ్చాం..



శ్రీశ్రీ సాహిత్య నిధిని స్థాపించినప్పుడు 100 పుస్తకాలు శ్రీశ్రీ మీద తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దానిని సాధించాం. దాని తర్వాత మరో 40 పుస్తకాలను సైతం తీసుకొచ్చాం. శ్రీశ్రీ జీవితం, సాహిత్యంపై ఆయన రాసిన గ్రంథాలు, శ్రీశ్రీ గురించి ఇతరులు రాసిన గ్రంథాలను పరిచయం చేస్తున్నాం. శ్రీశ్రీ సాహిత్యం అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ సమకాలీన సామాజిక పరిస్థితులను ఆవిష్కరిస్తూనే ఉంటుంది. శ్రీశ్రీ సాహిత్యం కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యానికి పాటుపడుతుందని బలంగా విశ్వసిస్తున్నాం.

– సింగంపల్లి అశోక్‌కుమార్, శ్రీశ్రీ సాహిత్య నిధి వ్యవస్థాపకుడు

18 నుంచి మహా శివరాత్రి మహోత్సవాలు

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి దర్శనానికి అనుమతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 18వ తేదీ నుంచి మహా శివరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. వివరాలు ఇవి.. 18వ తేదీ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వర స్వామి వారికి త్రికాల అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 9.30 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు మృత్తికా లింగాభిషేకం జరుగుతుంది. రాత్రి 12 గంటల నుంచి శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దివ్య లీలా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 19వ తేదీ ఆదివారం సాయంత్రం రథోత్సవం, 20వ తేదీ సోమవారం దుర్గాఘాట్‌లో అవభృతోత్సవంతో ఉత్సవాలు లాంఛనంగా ముగుస్తాయి.

మల్లేశ్వర స్వామి దర్శనానికి ఏర్పాట్లు..

మహా శివరాత్రిని పురస్కరించుకొని మల్లేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతిస్తున్నారు. ఆలయాభివృద్ధి నేపథ్యంలో గత కొన్ని నెలలుగా మల్లేశ్వర స్వామి వారి దర్శనానికి అనుమతి లేదు. అభిషేకాలు, ఇతర అర్చనలు బాలాలయంలోనే నిర్వహిస్తున్నారు. మహా శివరాత్రికి స్వామి వారిని దర్శించుకునేలా ఆలయ ప్రాంగణంలో క్యూలైన్ల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి.

చిక్కవరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గన్నవరం: మండలంలోని చిక్కవరంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై బుధవారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. గ్రామంలోని బస్టాప్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి గత రెండు రోజులుగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం నిర్జీవంగా పడి ఉన్న అతనిని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న ఎస్‌ఐ రమేష్‌బాబు సదరు వ్యక్తిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే మృతదేహం వద్ద సూర్యప్రకాశరావు అనే పేరుతో ఉన్న పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి కాగితంతో పాటు కొన్ని రకాల మందులను గుర్తించారు. అయితే మృతుని వివరాలు లభ్యం కాలేదని, మృతుని ఒంటిపై తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, బ్రౌన్ కలర్ లుంగీ ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు గన్నవరం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీతమ్మ వారి పాదాలు సమీపంలోని కృష్ణవేణి ఘాట్‌లో ఒక వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో సమీపంలోని వారు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నీటిలో తేలుతున్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహం వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతుని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, గుర్తు పట్టలేనంతగా శరీరం పాలిపోయిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి మెరుగైన వైద్య సహాయం అందించడం ద్వారా జిల్లాలో మాతా, శిశు మరణాలను పూర్తిగా నివారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మాతాశిశు మరణాల నివారణపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలు నివారణపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు, సిబ్బంది తమ పరిధిలో గర్భిణులను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వారికి అవసరమైన పూర్తి వైద్య సహాయం అందించాలన్నారు. ఇటీవల సంభవించిన మతాశిశు మరణాలను నోట్ చేసుకొని, అందుకుగల కారణాలను పూర్తి స్థాయిలో విశ్లేషించాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పౌష్టికాహారంపై దృష్టి..

కుటుంబ సభ్యులలో దీర్ఘకాలిక వ్యాధులు, పౌష్టికాహార లోపం ఉన్న గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరీక్షించాలన్నారు. గర్భిణుల ఆరోగ్యం, పౌష్టికాహార లోపాలను కుటుంబ సభ్యులకు వివరించి వారు కూడా పర్యవేక్షించేలా చైతన్యవంతులను చేయాలన్నారు. అప్పుడే అనుకున్న ఫలితాలను సాధించగలుగుతామన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి రోగనిరోధక టీకాలను వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం. సుహాసిని, డీడీహెచ్‌ఎస్ స్వప్న, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నళినిదేవి, డీఐఓ అమృతం, వైద్యులు పద్మావతి, దివిజ తదితరులు పాల్గొన్నారు.

తలశిల స్వర్ణకుమారికి ఘన నివాళి





స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దంపతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి చిత్రపటానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని రఘురామ్ నివాసం వద్ద బుధవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో వారంతా పాల్గొన్నారు. నివాళులు అర్పించిన వారిలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, జోగి రమేష్, విడదల రజని, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, ఉషా శ్రీచరణ్, అంబటి రాంబాబు, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దంపతులు, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, పేర్ని వెంకట్రామయ్య(నాని), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), కైలే అనిల్‌కుమార్, అనిల్‌కుమార్ యాదవ్, అబ్బయ్య చౌదరి, మొండితోక జగన్‌మోహనరావు, సామినేని ఉదయభాను, వల్లభనేని వంశీ, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, సింహాద్రి రమేష్, బాలినేని శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, ఎండీ రుహుల్లా, జంగా కృష్ణమూర్తి, కలెక్టర్లు ఎస్. ఢిల్లీరావు, రంజిత్ బాషా, మాధవీలత, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, ఎన్టీఆర్ జిల్లా సీపీ టీకే రాణా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆర్టీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ నాగిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పి. గౌతంరెడ్డి, అడపా శేషు, కాకుమాను రాజశేఖర్, గంజి చిరంజీవి, కొమ్మూరి కనకారావు, సినీ నిర్మాతలు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, దిల్ రాజు, పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌భార్గవ్, ఏపీ టూరిజం శాఖ ఎండీ కన్నబాబు, దుర్గ గుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ ఎ. నారాయణమూర్తి, బీజేపీ నేత పాతూరి నాగభూషణం తదితరులు స్వర్ణకుమారికి నివాళులు అర్పించారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్: విద్యార్థి మృతి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): టిప్పర్ ఢీకొనటంతో ఓ పీజీ విద్యార్థి మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థినిలు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం బందరు మండలం కృష్ణాయూనివర్సిటీకి సమీపంలో జరిగింది. బందరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చల్లపల్లికి చెందిన గణేష్(22), ఒంగోలుకు చెందిన సుప్రజ, కందుకూరుకు చెందిన సాయిదీపికలు కృష్ణాయూనివర్సిటీలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నారు. బుధవారం పరీక్ష రాసిన అనంతరం గణేష్ బైక్‌పై ముగ్గురు కలిసి మచిలీపట్నం బయలుదేరారు. రుద్రవరం క్రాస్ వద్దకు చేరుకున్న సమయంలో మచిలీపట్నం నుంచి యూనివర్సిటీ వైపు వేగంగా వస్తున్న టిప్పర్ వీరి వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో గణేష్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయ్యింది. సుప్రజ, సాయి దీపికలకు స్వల్పగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి విద్యార్థులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ముగ్గురిని సర్వజన ఆసుపత్రికి తరలించారు. గణేష్ పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ గణేష్ మృతి చెందాడు. సుప్రజ, దీపికలు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా జరిగిన ప్రమాదాన్ని యూనివర్సిటీ విద్యార్థులు ఖండిస్తూ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న టిప్పర్‌లను అడ్డుకున్నారు. కొద్దిసేపు ఆందోళనకు దిగారు. పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ చాణక్య తెలిపారు.

నోటీసు

నా క్లయింటు ఎన్.టి.ఆర్. జిల్లా, గంపలగూడెం మండలం, గంపలగూడెం గ్రామ కాపురస్తులు కొర్రా వెంకటేశ్వరరావు గారి కుమారుడు సాయి విదుష్ గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యిందుమూలముగా తెలియజేయునదేమనగా నా క్లయింటు రాశి బులియన్ & జ్యూయలరీ ప్రొప్రయిటర్‌గా వారి పేరున తిరువూరు ICICI బ్యాంకు అకౌంట్ నంబరు 395905500017, తిరువూరు SBI అకౌంట్ నంబరు 40064985068, తిరువూరు కరూర్‌వైశ్యా బ్యాంక్ అకౌంట్ నెంబర్ 4890135000007780తో ఖాతాలను నిర్వహించియున్నారు. సదరు మూడు ఖాతాల సంతకాలు చేసిన చెక్‌బుక్స్ నా క్లయింటు తిరువూరు నుండి గంపలగూడెం వచ్చుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల చెక్‌బుక్స్ నాకు గానీ నా క్లయింటుకి గానీ తిర్గి ఇవ్వగలరు. అంతే కాకుండా నా క్లయింటు పేరున రాశి బులియన్ & జ్యూయలరీ వ్యాపారమును అక్టోబర్ 2022లోనే నిలుపుదలచేసి యున్నాడు. అదేవిధంగా నా క్లయింటు రాశి బులియన్ & జ్యూయలరీ పేరు మీద నిర్వహించుచున్న మూడు బ్యాంకు ఖాతాలను కూడా రద్దు చేసుకొనుచున్నారు. సదరు ఖాతాల మీద ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల నా క్లయింటు నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

గంపలగూడెం 14-02-2023 — గోగిరెడ్డి కృష్ణారెడ్డి, అడ్వకేట్, గంపలగూడెం, ఎన్.టి.ఆర్. జిల్లా. సెల్: 9866818196